సాక్షి
వికారాబాద్

బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



క్యారెట్ సాగుతో లాభాలు

క్యారెట్ సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుంది. నీటి వసతి ఉంటే చాలు సాగు అనుకూలంగా ఉంటుంది.

8లో ▸



లింక్ క్లిక్ చేస్తే అంతే!

సాంకేతిక రంగం కొత్తపుంతలు తొక్కుతున్నా కొద్దీ నేర స్వరూపం రూపాంతరం చెందుతూనే ఉంది.

8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
బుధవారం	గురువారం
సాయంత్రం	ఉదయం
6:34	4:46

న్యూస్‌రీల్

నేడు వికారాబాద్‌కు కేటీఆర్

అనంతగిరి: బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లి గౌలి కార్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మాజీ మంత్రి సబితా రెడ్డి, పార్టీ చేవెళ్ల లోక్ సభ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ తదితరులు హాజరవుతారని చెప్పారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'ఇఫ్తార్'తో సోదరభావం పెంపొందుతుంది

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే టీఆర్ఆర్

పరిగి: ఇఫ్తార్ విందులతో హిందూ, ముస్లింల మధ్య సోదరభావం పెంపొందుతుందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని జామియా మసీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే సర్వమత సమ్మేళనం సాధ్యమన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఆచరించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో మత సామరస్యం, శాంతి వెల్లివిరుస్తోందని తెలిపారు. ఈ విందులో కాంగ్రెస్ నాయకుడు పార్థసారథి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యేల వినతి



అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అనంతగిరి: ప్రభుత్వం రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం పార్టీ పిలుపు మేరకు రైతు సమస్యలపై అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పండిన పంటకు ప్రతీ క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. పంటనష్టం అంచనా వేసి సంక్షోభంలో చిక్కుకున్న రైతును ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి కౌన్సిలర్ గోపాల్, పార్టీ నాయకులు రాంరెడ్డి, విజయ్‌కుమార్, సుభాన్‌రెడ్డి, అశోక్, షఫీ, కొఠారి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

'జనజాతర సభ' ఏర్పాట్ల పరిశీలన

తుక్కుగూడ: కాంగ్రెస్ పార్టీ ఈనెల 6న తుక్కుగూడలో నిర్వహించే 'జనజాతర సభ' ఏర్పాట్లను మంగళవారం ఆ పార్టీ నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. బహిరంగ సభకు పార్టీ అగ్రనేతలు హాజరవుతున్నందున ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. పార్టీ శ్రేణులు అధిక హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితరెడ్డి, మాజీ ఎమ్మెల్యే టీకేఆర్, మేయర్ పారిజాత, తదితరులు పాల్గొన్నారు.

వేసవి తాపం



ఎండల తీవ్రతతో అప్రమత్తంగా ఉండాలి

- అత్యవసరమైతేనే బయటకు రావాలి
- వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి
- ప్రతి పీహెచ్‌సీలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం
- 'సాక్షి'తో జిల్లా వైద్యాధికారి పల్వాన్‌కుమార్



వికారాబాద్: వేసవికాలం ఆరంభం కావటంతో పాటు ఎండల తీవ్రత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.లేదంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదముంది. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వైద్యారోగ్య శాఖ పరంగా తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. ప్రజలు సహకరిస్తే వడదెబ్బ బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోగల్గుతామని డీఎంహెచ్ఓ పల్వాన్‌కుమార్ అన్నారు. వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. శాఖా పరంగా వారు తీసుకుంటున్న చర్యలపై డీఎంఅండ్‌హెచ్ఓ మంగళవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూ ఆయన మాటల్లోనే...

అత్యవసరమైతేనే బయటకు

ఎండల తీవ్రతతో పాటు వడగాలుల తీవ్రత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ సూచనల మేరకు శాఖాపరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వడదెబ్బకు గురయ్యే సమయంలో చేయాల్సిన ప్రథమ చికిత్స, చేయకూడని పనుల విషయంలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో 750 మంది ఆశ వర్కర్లు పనిచేస్తుండగా ప్రతీ ఆశ వర్కర్ వద్ద వంద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం. సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్ల దగ్గర ఉన్న ఓఆర్ఎస్ ప్యాకెట్లకు రెండింతలు ఇప్పటికే అందుబాటులో ఉంచాం. ప్రస్తుతం జిల్లాలో లక్ష ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. ఉపాధీ హామీ పని ప్రదేశంలోనూ ఓఆర్ఎస్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎండల తీవ్రత ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవటమే మేలు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బయట తిరగకుండా ఉంటేనే మంచిది. అత్యవసరమై బయటకు వెళ్లాల్సి వస్తే జాగ్రత్తలు పాటించాలి. జిల్లా వ్యాప్తంగా గ్రామ, మున్సిపల్ వార్డుల స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ వైద్యులు, పట్టణ, పల్లె బస్తీ దవాఖానాల్లో విధులు నిర్వహించే వైద్యులు, వైద్య సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశాం. చేపడుతున్న కార్యక్రమాలపై క్రమం తప్పకుండా రివ్యూ నిర్వహిస్తున్నాం.

వేసవిలో చేయకూడనివి..

- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు.
- మద్యానికి దూరంగా ఉంటే మేలు. మద్యం సేవిస్తే డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఎక్కువ.
- రోడ్ల వెంట విక్రయించే రంగుతో కూడిన శీతల పానీయలకు, కలుషిత ఆహారానికి దూరంగా ఉండాలి.
- మాంసాహారం తగ్గించాలి. పల్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి.



ఇవి చేస్తే మేలు

- మితాహారం మేలు.
- ప్రతీ రోజు 12కు తక్కువ కాకుండా 15 గ్లాసుల నీరు తాగాలి.
- పళ్ల రసాలు, కొబ్బరి నీరు. ద్రవ పదార్థాలు తీసుకోవాలి.
- ఉదయం, సాయంత్రం స్నానం, పలుచని, లేతవర్ణం కాటన్ దుస్తులు ధరించాలి.
- ఆరుబయటపడు కుంటే దోమతెరలు వాడాలి.
- బయటకు వెళ్తే టోపీ, గొడుగులు ఉపయోగించాలి.

వడదెబ్బ తగిలితే..

- వడదెబ్బకు గురైన వ్యక్తిని నీడకు చేర్చి, గాలితగిలేలా చూడాలి.
- శరీరం సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చే వరకు తడి గుడ్డతో తుడవాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోస్ ద్రావణం, ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలి.
- అపస్మారక స్థితిలోఉంటే నీరు తాపకూడదు.
- ప్రథమ చికిత్స అనంతరం సమీపంలోని ఆస్పత్రిలో చేర్చాలి.



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పొరపాట్లకు తావివ్వొద్దు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి
- ఎన్నికల విధులపై పీఓ, ఏపీఓలకు శిక్షణ

అనంతగిరి: పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన వికారాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నిర్వహణపై ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ వారికి పోలింగ్ ప్రక్రియపై సూచనలు, సలహాలు ఇచ్చారు. పొరపాట్లకు తావివ్వకుండా సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నియమావళిని అనుసరించి విధులు నిర్వర్తించాలని కలెక్టర్ తెలిపారు. హ్యాండ్ బుక్‌లెట్స్‌ను క్షుణ్ణంగా చదివి పోలింగ్ విధానాన్ని తెలుసుకోవాలని.. అనుమానాలుంటే మాస్టర్ ట్రైనర్లను సంప్రదించి అనుమానాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. విధి నిర్వహణలో అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎన్నికలు సజావుగా నిర్వహించాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మాస్టర్ ట్రైనర్లు రాంరెడ్డి, వీరకాంతం తదితరులు ఉన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరి

వేసవి నేపథ్యంలో డీహైడ్రేషన్‌ను నివారించేందుకు జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ నారాయణరెడ్డి వైద్యాధికారులను సూచించారు. మంగళవారం ఆయన రామయ్యగూడ (అనంతగిరిపల్లి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అవుట్ పేషెంట్, సిబ్బంది హాజరు పట్టిక రిజిస్టర్‌లు, ఔషధ నిలువ గదిని కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రసవాలకు సంబంధించి ఈడీడీ (ఎక్స్‌పెక్టెడ్ డేటా ఆఫ్ డెలివరీ) బోర్డులో గర్భిణీల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన వైద్యాధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆశ వర్కర్, క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది వద్ద సైతం వందకు తగ్గకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట డీఎంహెచ్ఓ పల్వాన్ కుమార్, డాక్టర్ సృజన, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

పల్లెల అభివృద్ధి ప్రధాని ఘనతే..

- పార్టీ మారిన రంజిత్‌రెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పండి
- ప్రజా ఆశీర్వాద యాత్రలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు రూరల్: పంచాయతీల అభివృద్ధి ప్రధాని మోదీ ఘనతేనని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కరన్‌కోట్, చంద్రవంచ, మల్కాపూర్, కోటబాసుపల్లి, ఐనెల్లి, జినుగుర్తి, గౌతాపూర్, చెంగోల్ గ్రామాల్లో మంగళవారం ఆయన ప్రజా ఆశీర్వాద యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేవలం పదవీ వ్యామోహంతో పార్టీ మారిన రంజిత్‌రెడ్డికి బుద్ధి చెప్పాలన్నారు. దేశం సురక్షితంగా ఉండాలంటే బీజేపీకే పట్టం కట్టాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. దేవుడి భూములు కబ్జా చేసిన రంజిత్‌రెడ్డి స్వార్థ ప్రయోజనం కోసమే కాంగ్రెస్‌లో చేరారని ఆరోపించారు.

డీసీసీబీ మాజీ చైర్మన్‌తో భేటీ..

మండల పరిధిలోని కోటబాసుపల్లికి చెందిన డీసీసీబీ మాజీ చైర్మన్ సిరిగిరిపేట్ సాయిరెడ్డిని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కలిసి సన్మానించారు. రాజకీయ చర్చల అనంతరం తన గెలుపుకోసం మద్దతివ్వాలని సాయిరెడ్డిని కోరారు. కాగా సాయిరెడ్డి కుమారుడు వీరేందర్‌రెడ్డి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా కొనసాగుతుండగా.. ఆయన చిన్న కోడలు స్వరూప వైస్ ఎంపీపీ. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఉప్పరి రమేశ్‌కుమార్, గాజుల శాంత కుమార్, మండల అధ్యక్షుడు ప్రభుశంకర్, నాయకులు శ్రీహరి, సంజీవరెడ్డి, లలిత, విజయ్ కుమార్, భద్రేశ్వర్, ఆంజనేయులు, సూర్యకాంత్, చిరంజీవి, శ్రీకాంత్, మల్లికార్జున్, రవి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: డీసీసీబీ మాజీ చైర్మన్ సాయిరెడ్డిని సన్మానిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అవినీతి చరిత్ర ఆయన సొంతం

తాండూరు: ప్రధాని మోదీ పేరుతోనే ఎన్నికల ప్రచారం చేస్తానని బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలో ఓ హోటల్‌లో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన ప్రత్యర్థి రంజిత్‌రెడ్డి అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్‌లో చేరారన్నారు. ఆయన నెల క్రితం బీజేపీలో చేరేందుకు అమిత్‌షాను కలిసారని గుర్తు చేశారు. షరతులు లేకుండా పార్టీలో చేరాలని అమిత్‌షా సూచించారని.. తన గెలుపుకోసం పనిచేస్తానని రంజిత్‌రెడ్డి మెసేజ్ చేశారని గుర్తు చేశారు. కోళ్ల దాణా, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఇచ్చే గుడ్లలోనూ అవినీతికి పాల్పడిన చరిత్ర ఆయన సొంతమన్నారు. తాను అపోలో ఆస్పత్రిలో ప్రతీ రోజు పదుల సంఖ్యలో వైద్యసాయం అందిస్తున్నానన్నారు. పార్లమెంట్ పరిధిలో నిర్వహిస్తున్న ప్రజాఆశీర్వాద సభ ఇప్పటికే 12 మండలాల్లో పూర్తైందని.. మరో పది రోజుల్లో 13 మండలాల్లో పర్యటిస్తానన్నారు. వికారాబాద్ జిల్లాలో మూడు లక్షల మంది ఓటర్లు బీజేపీకి ఓటు వేస్తారన్నారు.

గంజాయి గుట్టు రట్టు

- ఎస్ఓటీ పోలీసుల దాడి
- 580 గ్రాముల గంజాయి, 92 గంజాయి చాక్లెట్లు స్వాధీనం
- ఇద్దరు నిందితులకు రిమాండ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు, చాక్లెట్లు



నిందితులు సౌరభ్‌కుమార్‌యాదవ్, ముజ్తాబా అలిఖాన్

మొయినాబాద్: గంజాయి చాక్లెట్లు, గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తున్న స్థావరంపై ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి ఇద్దరి యువకులను పట్టుకున్నారు. వారి నుంచి 580 గ్రాముల గంజాయి (ప్యాకెట్లు), 92 గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్ట శివారులో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం సహర్సా జిల్లా మోర్కాహి గ్రామానికి చెందిన సౌరభ్‌కుమార్‌యాదవ్ సంవత్సరం క్రితం నుంచి మొయినాబాద్ మండలంలోని తోలుకట్ట గ్రామ శివారులో ఉంటూ తోలుకట్ట గేటు వద్ద ఉన్న మాణిక్యం వెల్డింగ్ షాపులో వెల్డింగ్ పని చేస్తున్నాడు. కొంత కాలం నుంచి బీహార్ రాష్ట్రం మాధేపురా జిల్లా ఖోప్రియాటోన్ గ్రామానికి చెందిన సుబోధ్‌సింగ్ అలియాస్ సుబోధ్ ఖోప్రియా దగ్గరి నుంచి సౌరభ్‌కుమార్‌యాదవ్ గంజాయి, గంజాయి చాక్లెట్లు కొనుగోలు చేసి తోలుకట్టకు తీసుకొచ్చి చిన్నచిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేసి అమ్ముతున్నాడు. సోమవారం అర్ధరాత్రి నగరంలోని లంగర్‌హౌస్‌లో ఉంటూ జ్యూస్ మేకర్‌గా పనిచేసే బీహార్ రాష్ట్రానికి చెందిన ముజ్తాబా అలీఖాన్ అలియాస్ అథర్ అలీఖాన్ అలియాస్ ప్రిన్స్ తోలుకట్టకు వచ్చి వ్యవసాయ పొలంలో ఉన్న రేకుల షెడ్‌కు వెళ్లి సౌరభ్ కుమార్ యాదవ్ దగ్గర గంజాయి కొంటున్నాడు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి దాడి చేసి ఇద్దరినీ పట్టుకున్నారు. వారి వద్ద 92 గంజాయి చాక్లెట్లు, 580 గ్రాముల గంజాయి (చిన్న ప్యాకెట్లు), 5 సెల్‌ఫోన్లు (ఇందులో ప్రిన్స్ దొంగతనం చేసిన సెల్‌ఫోన్లు-2), గంజాయి ప్యాకెట్లు తయారు చేసే సీలింగ్ మిషన్, రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.80 వేలు ఉంటుంది.

సెల్‌ఫోన్లు ఇచ్చే గంజాయి కొనుగోలు..

మొయినాబాద్ మండలం తోలుకట్టలో సౌరభ్‌కుమార్‌యాదవ్ దగ్గర గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన ముజ్తాబా అలిఖాన్ అలియాస్ అథర్ అలీఖాన్ అలియాస్ ప్రిన్స్ సెల్‌ఫోన్ల దొంగ. నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో అతనిపై ఇప్పటికే 10 సెల్ ఫోన్ దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి. దొంగతనం చేసిన సెల్ ఫోన్లను ఇచ్చే గంజాయి కొనుగోలు చేస్తాడు. సోమవారం అర్ధరాత్రి సైతం ఇదే తరహాలో గంజాయి కొనుగోలు చేస్తుండగా ఎస్ఓటీ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి

గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం చేయాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్ అన్నారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన గిరిజన మోర్చా నేతల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాన మంత్రి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టారని తెలిపారు. పదేళ్ల కాలంలో దేశం అన్ని రంగాల్లో ఎంతో పురోభివృద్ధి సాధించిందని అన్నారు. ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధాని మోదీ బలమైన పునాది వేశారన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధించి మూడోసారి అధికారం చేపట్టడం ఖాయమని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు విశ్వసించడం లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పాలమూరు లోక్‌సభ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రేమజంట ఆత్మహత్య

- చికిత్స పొందుతూ మార్చి 31న బాలిక..
- మంగళవారం యువకుడి మృతి



శ్రీకాంత్ (ఫైల్)



మాధవి (ఫైల్)

కొందుర్గు: ఇన్‌స్టాగామ్ పరిచయం కాస్తా ప్రేమగా మారి పెళ్లికి దారితీసింది. అమ్మాయి మైనర్ కావడంతో కుటుంబ పెద్దలు, బంధువులు అడ్డు చెబుతారని భావించిన ప్రేమ జంట పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన కొందుర్గు మండలం ఉత్తరాసిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కావలి శ్రీకాంత్(24) షాద్‌నగర్‌లో ఓ కిరాణ షాపులో పని చేస్తున్నాడు. కిస్మత్‌పూర్ గ్రామానికి చెందిన మాధవి(16)తో ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారి పెళ్లి వరకు వెళ్లింది. అమ్మాయి మైనర్ కావడంతో పాటు ప్రేమ పెళ్లిని పెద్దలు అంగీకరించకపోవచ్చని ఇద్దరూ మార్చి 27న యాదగిరిగుట్టలో వివాహం చేసుకున్నారు. మార్చి 30న శ్రీకాంత్ జంటగా స్వగ్రామానికి వచ్చారు. కుటుంబ సభ్యులు నిరాకరిస్తారనే భయంతో శ్రీకాంత్, మాధవి గ్రామ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన స్థానికులు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు మార్చి 31న హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న మాధవి అదే రోజు రాత్రి మృతి చెందగా.. శ్రీకాంత్ మంగళవారం తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు వెల్లడించారు. దీనిపై శ్రీకాంత్ తల్లి లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కొందుర్గు ఠాణా హెడ్ కానిస్టేబుల్ శ్రీనయ్య తెలిపారు.

కేసీఆర్ సభను విజయవంతం చేద్దాం

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



చేవెళ్లలోని ఫరా కళాశాల గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు సబితారెడ్డి, కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ వాణీదేవి, కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 13న చేవెళ్లలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేద్దామని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితారెడ్డి పిలుపునిచ్చారు. ఫరా ఇంజనీరింగ్‌కళాశాల గ్రౌండ్‌లో కేసీఆర్ హాజరయ్యే సభా స్థలాన్ని మంగళవారం పార్టీ లోక్‌సభ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. మాయమాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. 110 రోజుల పాలనలో చేసిందేమీ లేదని.. రైతులు, ప్రజలకు కన్నీళ్లే మిగిల్చిందని విమర్శించారు. ప్రజలకు మేలు జరగాలంటే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఈనెల 13న చేవెళ్లలో జరిగే భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. ప్రజలకు మేలు చేసే, అందుబాటులో ఉండే పార్టీలను, నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.బాల్‌రాజ్, ప్రభాకర్, అనంత్ రెడ్డి, శివారెడ్డి, యాదగిరి, వెంకటేశంగుప్తా, తోట శేఖర్, నరహరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీజేపీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు: తాండూరు నియోజకవర్గ బీజేపీ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ కార్యాలయాన్ని స్థానిక నాయకులు ఖాళీ చేశారు. అయితే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గతంలో ఉన్న పార్టీ కార్యాలయ భవనంలోనే తిరిగి బీజేపీ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు నరేష్‌మహరాజ్, కొండా మాధవరెడ్డి, యు.రమేష్ కుమార్, కృష్ణముదిరాజ్ తదితరులున్నారు.

మహిళ అదృశ్యం

తలకొండపల్లి: మండల పరిధిలో ఓ మహిళ అదృశ్యమైన సంఘటన పెద్దూర్ తండాలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ చెప్పిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మూడావత్తు బుజ్జి(43) గత నెల 25న మార్కెట్ నిమిత్తం తలకొండపల్లి మండల కేంద్రానికి వెళ్లింది. అప్పటి నుంచి ఆమె ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారందరిని విచారించారు. మిత్రులు, బంధువుల ఇళ్ల వెతికారు. అయినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. ఆమె తల్లి కేతావత్ బక్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు మంగళవారం ఎస్ఐ తెలిపారు.

బతుకుదెరువుకు వచ్చి.. షార్ట్ సర్క్యూట్ తగిలి

వలస కార్మికుడి మృతి



అనిల్‌కుమార్ మృతదేహం

కేశంపేట: పొట్టకూటి కోసం వలస వచ్చిన ఓ యువకున్ని షార్ట్ సర్క్యూట్ బలి తీసుకుంది. విద్యుదాఘాతంతో వలస కార్మికుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అల్వాల గ్రామ శివారులో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన అనిల్‌కుమార్ గోండు(22), మనోజ్ కుమార్ గోండు, జార్జీకుమార్‌లు కొత్తపేట గ్రామానికి చెందిన దండే మహేష్ వద్ద ఫ్రీకాస్టు పనులు చేసేందుకు కొద్ది రోజుల క్రితం కూలీకి వచ్చారు. గ్రామానికే చెందిన మాజీ డిప్యూటీ సర్పంచ్ నరేష్‌కుమార్ పొలంలో ఫ్రీకాస్టు తయారు చేసేందుకు మహేష్ కాంట్రాక్టు తీసుకొని వలస కార్మికులతో పనులు చేయించేవాడు. మంగళవారం ఫ్రీకాస్టు తయారీ చేస్తుండగా షార్ట్‌సర్క్యూట్ తగిలి అనిల్‌కుమార్‌కు తీవ్ర గాయాలు, మిగతా ఇద్దరికి సాధారణ గాయాలు కావడంతో కేశంపేట ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిని పరీక్షించిన వైద్యులు అనిల్‌కుమార్ మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై మృతుడి అన్న మనోజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

భువనగిరి బరిలో సీపీఎం

పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

అబ్దుల్లాపూర్‌మెట్: లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి సీపీఎం పోటీ చేస్తుందని, ప్రశ్నించే గొంతుకను లోక్‌సభకు పంపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. పార్టీ జిల్లా కమిటీ సమావేశం మంగళవారం మండలంలోని మజీద్ పూర్‌లో జరిగింది. జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కేడర్‌ను కదిలించి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. దేశ వ్యాప్తంగా బీజేపీ పాలనలో మతోన్మాదం ప్రమాదకరంగా మారిందని, ఈ విషయాన్ని ప్రజలందరికీ అర్థమయ్యేలా వివరించాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. నాయకులు భాస్కర్, యాదయ్య, సామేలు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

క్యారెట్ సాగుతో లాభాలు బాగు

- మార్కెట్‌లో డిమాండ్
- ఆరుతడి సాగుకు అనుకూలం
- అధికారుల సూచనలు పాటించాలి
- చేవెళ్ల ఉద్యాన శాఖ అధికారి అశోక్



షాబాద్: క్యారెట్ సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుంది. నీటి వసతి కలిగి ఉంటే చాలు క్యారెట్ సాగు చాలా అనుకూలంగా ఉంటుంది. ముఖ్యంగా క్యారెట్‌ను పచ్చిగా తినడంతో రేచీకటి, గుండెపోటును నివారిస్తుందని డాక్టర్లు సైతం భరోసా ఇస్తున్నారు. అనేక వంటకాలతోపాటు సలాడ్లలోనూ క్యారెట్‌ను విరివిగా వినియోగిస్తారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ పలుకుతుండటంతో రైతులు క్యారెట్ సాగు వైపు మొగ్గు చూపిస్తున్నారు. కొద్దిపాటి శ్రమతో, తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం సాధించవచ్చని చేవెళ్ల ఉద్యాన శాఖ అధికారి అశోక్ సూచించారు. క్యారెట్ సాగు విధానంపై ఆయన తెలిపిన సలహాలు, సూచనలు..

నేలలు

- నీటి వసతి కలిగిన లోతైన గరప నేలలు అనుకూలంగా ఉంటాయి. క్యారెట్‌లో చాన్‌టినీ, పూసాకేసర్, ఎర్లీ నాంటిస్ అనే రకాలు ఉన్నాయి. ఎకరానికి 2 కిలోల విత్తనాలు సరిపోతాయి. మొక్కను 30 సెంటీ మీటర్ల దూరంలో నాటుకోవాలి.

ఎరువులు వేసుకునే విధానం

- ▲ ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువుని వేసుకొని మెత్తగా కలియ దున్నుకోవాలి.
- ▲ ఎకరానికి 20:16:20 కిలోల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్‌లను ఆఖరి దుక్కిలో వేసుకోవాలి.
- ▲ నత్రజనిని రెండు దఫాలుగా వేయాలి. మొదటి సగం ఆఖరి దుక్కిలో, రెండవ భాగం విత్తిన ఆరు వారాల తర్వాత వేసుకోవాలి.



షాబాద్: పోలారంలో రైతులు సాగు చేస్తున్న క్యారెట్ పంట

నీటి తడులు

- వారం, పది రోజులకొకసారి వాతావరణ పరిస్థితులను బట్టి నీటి తడిని అందించాలి.
- ఎప్పటికప్పుడూ కలుపు మొక్కలను తొలగించుకోవాలి.

సస్య రక్షణ చర్యలు

- ఆకులు తినే పురుగులు, ఆకుమచ్చ, మాడు తెగులు, బూడిద తెగులు సోకి పంటకు నష్టాన్ని కలిగిస్తాయి.
- గొంగళి పురుగులు ఆకులను కొరికి తినడంతో ఆకులపై చిన్న చిన్న రంధ్రాలు ఏర్పడతాయి.
- ఆకుమచ్చ పురుగుల వల్ల ఆకులపై ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడి మొక్కలు ఎండిపోతాయి.
- మాడు తెగులుతో ఆకులపై మచ్చలు ఏర్పడి పండు బారి మాడిపోతాయి.
- బూడిద తెగులు వల్ల ఆకులపై, కింద భాగాలల్లో బూడిద వంటి ద్రవం ఏర్పడుతుంది. తద్వారా ఆకులు పండిపోయి ఎండిపోతాయి.

నివారణ చర్యలు

క్యారెట్ సాగును ఆశించే ఆకుమచ్చ, మాడు తెగులు, బూడిద తెగులు, ఆకుతినే పురుగుల నివారణకు మలాథియాన్ 2 మి.లీటర్లను వెటబుల్ సలఫర్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి విత్తిన 4 నుంచి 7 వారాల వ్యవధిలో పిచికారీ చేయాలి. 90 రోజుల్లోనే పంట చేతికొస్తుంది. ఎకరానికి 8 టన్నుల క్యారెట్ దుంపల దిగుబడి వస్తుంది.

లింక్ క్లిక్ చేస్తే అంతే!

- ఎన్నికల వేళ పథకాల పేరుతో మోసం
- సైబర్ కేటుగాళ్లతో జాగ్రత్త
- ఆదమరిస్తే ఖాతాలు లూటీ



దౌల్తాబాద్: సాంకేతిక రంగం కొత్తపుంతలు తొక్కుతున్నా కొద్దీ నేర స్వరూపం రూపాంతరం చెందుతూనే ఉంది. ప్రజలను మోసం చేయడానికి సైబర్ నేరస్తులు రోజుకో కొత్త మార్గాన్ని అన్వేషిస్తున్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పథకాల పేరుతో అమాయకులకు టోకరా వేయడానికి ప్రయత్నిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సోషల్ మీడియాలో లింక్‌లు పంపుతూ నమ్మిస్తున్నారు. ఆ లింక్ ఓపెన్ చేసి వివరాలు నమోదు చేయగానే బ్యాంక్ ఖాతాలో నగదు మాయం చేస్తున్నారు. నాలుగు నెలల క్రితం ఇలాంటి సంఘటనలే వెలువడ్డాయి. మండల కేంద్రంలో ఓ మీసేవ నిర్వాహకుడికి ఫోన్ చేసి తాను ఏఎస్ఐని మాట్లాడుతున్న.. అర్జెంట్‌గా రూ.20వేలు పంపు నేను వచ్చి ఇస్తానని డబ్బులు వేసుకున్న ఉదంతాలు ఉన్నాయి. ఇలా సైబర్ నేరగాళ్లు నమ్మశక్యం కాని రీతిలో మోసాలకు పాల్పడుతున్నారు.

సామాజిక మాధ్యమాల వేదికగా

ప్రజలను మోసం చేయడానికి సైబర్ నేరగాళ్లు సామాజిక మాధ్యమాలను ఎంచుకుంటున్నారు. ఫేస్‌బుక్, ఎక్స్, వాట్సప్‌లలో లింకులు పెట్టి అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు. ఫోన్‌లో ప్రకటనలు టచ్ చేయడంతో సైబర్ నేరగాళ్లు రూపొందించిన వెబ్‌సైట్ ఓపెన్ అవుతుంది. అది ప్రభుత్వ వెబ్‌సైట్ లాగానే ఉండడంతో చాలా మంది నమ్మి మోసపోతున్నారు. ఆయా పథకాల కోసం దరఖాస్తులు చేసుకోవడానికి వివరాలు నమోదు చేయగానే బ్యాంక్ అకౌంట్ నుంచి క్షణాల్లో డబ్బులు కట్ అవుతున్నాయి. తీరా మోసపోయామని తెలిసి బాధితులు లబోదిబోమంటున్నారు. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. అనవసరమైన లింక్‌లు ఓపెన్ చేయొద్దని హెచ్చరిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



స్మార్ట్‌ఫోన్‌లకు వచ్చిన లింకులు ప్రకటనలతో అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. లేదంటే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలి. 24 గంటలలోపు ఫిర్యాదు చేస్తే డబ్బులు పోకుండా చూసే అవకాశం ఉంటుంది.

– శ్రీశైలంయాదవ్, ఎస్ఐ, దౌల్తాబాద్

జీతాలు వెంటనే విడుదల చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మిషన్ భగీరథ ఉద్యోగులు

మిషన్ భగీరథ హెల్పర్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

పరిగి: జీతాలు రాక అనేక అవస్థలు పడుతున్నామని, ప్రభుత్వం వెంటనే జీతాలు విడుదల చేయాలని మిషన్ భగీరథ హెల్పర్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మిషన్ భగీరథ సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వీఆర్ఏలుగా విధులు నిర్వహిస్తున్న మమ్మల్ని గత ప్రభుత్వం మిషన్ భగీరథ హెల్పర్స్‌గా నియమించింది. ఎనిమిది నెలలుగా విధులు నిర్వహిస్తే కేవలం రెండు నెలల వేతనాలు మాత్రమే అందాయన్నారు. ఇంకా ఆరు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. నెలల తరబడి అప్పులు చేసి కుటుంబాన్ని పోషించడం భారంగా ఉందన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలతో నిత్యం ప్రభుత్వానికి వెట్టి చాకిరి చేసి వస్తున్నామన్నారు. కావున ప్రభుత్వం వెంటనే వేతనాలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతిని అడ్డుకోవద్దు



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఆర్డీఓకు వినతిపత్రం అందజేసిన ప్రజాసంఘాల నాయకులు

తాండూరు టౌన్: మహనీయుల జయంతి నిర్వహణకు అధికారులు ఆటంకం కలిగించొద్దని పలువురు ప్రజాసంఘాల నాయకులు మంగళవారం ఆర్డీఓ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 5న బాబూ జగ్జీవన్‌రామ్, 11న మహాత్మా జ్యోతిబాపూలే, 14న అంబేడ్కర్ జయంతి ఉన్నాయన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందనే సాకుతో జయంతికి అడ్డుకోరాదని కోరారు. ప్రభుత్వం సైతం అధికారికంగా వారి జయంతిని నిర్వహించాలన్నారు. మహనీయుల ఆశయాలను ప్రజలకు తెలియజేసే కార్యక్రమాలను అడ్డుకోరాదన్నారు. ఏప్రిల్ నెలలో జరగనున్న మహనీయుల జయంతికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మేధావులు, కళాకారులు అందరూ హాజరు కావాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, నాయకులు చంద్రయ్య, రత్నం, భీమప్ప, నరేందర్, లచ్చప్ప పాల్గొన్నారు.

జిల్లాకు కేంద్ర బలగాలు



ఐటీబీపీఎఫ్ అధికారులతో సమావేశమైన ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు కేంద్ర బలగాలు వచ్చాయి. ఈ మేరకు మంగళవారం ఐటీబీపీఎఫ్(ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్)ఉన్నత అధికారులతో ఎస్పీ కోటిరెడ్డి తన కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన సున్నితమైన, అతి సున్నితమైన విషయాలను వివరించారు. సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరగుటానికి సహకరించాలని ఎస్పీ తెలిపారు. జిల్లాకు రెండు దళాలు వచ్చాయన్నారు. సమావేశంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, ఐటీబీపీఎఫ్ ఎస్పీ ఆడోల్లిచార్స్, డీఎస్పీ సందీప్ కాల్కల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో రోడ్డు విస్తరణ

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పాత జాతీయ రహదారి విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులకు సూచించారు. పట్టణంలోని పాత జాతీయ రహదారి విస్తరణ పనులపై మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోడ్డు విస్తరణకు సంబంధించిన నమూనా పత్రాలను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అత్యాధునిక పద్ధతులతో పాత జాతీయ రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక వనరులను సరిగా సమకూర్చకపోవడంతో అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయన్నారు. ఆర్అండ్‌బీ డీఈ రవీందర్ పాల్గొన్నారు.



రోడ్డు ప్రొఫైల్ నమూనాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య

పరిగి: పని ప్రదేశాల్లో ఉపాధి కూలీలకు సౌకర్యాలను కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య ఆరోపించారు. మంగళవారం మండలంలోని మిట్టకోడూర్ గ్రామంలో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు సకాలంలో డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎండలు మండుతున్నాయని కూలీలకు వడదెబ్బ తలిగే ప్రమాదం ఉందని, పని ప్రదేశాల్లో కనీసం తాగే నీరు కూడా అందించడం లేదన్నారు. ఉపాధి కూలీ పనులు చేసే ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఉచితంగా పార, గడ్డపార అన్ని రకాల పరికరాలు అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు రూ.300 ప్రకటిస్తే కూలీలకు మాత్రం రూ.150 లోపు రావడం దుర్మార్గమన్నారు. రెండు వారాల ఉపాధి డబ్బులు రాకపోతే ఎన్ని రోజులు ఆలస్యం అయితే అన్ని రోజులు వడ్డీతో చెల్లించాలని చట్టం చెబుతుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి కూలీల సమస్యల ను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

మృతదేహం లభ్యం

అనంతగిరి: వికారాబాద్ మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి గల్లంతయిన ఎరుకల చిన్న అనంతయ్య(60)మృతదేహం లభ్యమైంది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి వరకు బోటింగ్, గజ ఈతగాళ్లు గాలింపు చేపట్టిన విషయం తెలిసిందే. కాగా అర్ధరాత్రి సమయంలో మృతదేహం లభ్యమైంది. మంగళవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

ఇద్దరి కాళ్లు నుజ్జునుజ్జు

చేవెళ్ల: అతివేగంగా వచ్చిన లారీ ద్విచక్రవాహనాన్ని వెనక నుంచి ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని అల్లావాడ బస్‌స్టేజీ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండలంలోని ఎర్రోనిగూడ గ్రామానికి చెందిన మకుటం నర్సింలు(47), సోమయ్య(70)లు కథలు చెప్పుకొంటూ జీవనం సాగిస్తుంటారు. ఇందులో భాగంగానే సోమవారం రాత్రి వేరే ఊళ్లో కథ చెప్పటానికి వెళ్లిన వారు మంగళవారం ఉదయం ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తుండగా అల్లవాడ స్టేజీ దాటిన తరువాత వెనక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఇద్దరు ఎగిరి రోడ్డుపై పడిపోవటంతో వారి కాళ్లపై నుంచి లారీ చక్రాలు వెళ్లటంతో కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు అంబులెన్స్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిన వారిని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం నగరంలో ఓ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ లారీని అక్కడి నిలిపివేసి పారిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫిట్స్‌తో ఎంటమాలజీ కార్మికుడి మృతి

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల విభాగానికి సంబంధించిన పనులు చేస్తున్న ఎంటమాలజీ(దోమల నివారణ) విభాగం ఔట్‌సోర్సింగ్ కార్మికుడు ఫిట్స్‌తో మృతి చెందిన సంఘటన జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎంటమాలజీ విభాగంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను ఎన్నికల నేపథ్యంలో ప్రధాన కార్యాలయంలో పనుల్లో నియమించారు. వారిలో ఒకరైన పెండ్యాల కిషన్(48)కు ఫిట్స్ రావడంతో సమీపంలోని నర్సింగ్‌హోమ్‌కు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు.కాచిగూడలోని గోల్నాకలో పనిచేసే కిషన్‌తో పాటు మరికొందరిని సోమవారమే ప్రధాన కార్యాలయంలో పనులకు నియమించినట్లు సమాచారం.

వేర్వేరు ఘటనల్లో మూగజీవాలు బలి



కుల్కచర్ల: కళేబరం వద్ద బాధిత రైతు



దోమ: జింక కళేబరం

విద్యుదాఘాతంతో ఆవు మృతి

కుల్కచర్ల: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బిందెంగడ్డ తండా గ్రామపంచాయతీ చింతల్ కుంటకు చెందిన ఎం.రాములుకు చెందిన ఆవు మంగళవారం మేత మేస్తున్న క్రమంలో విద్యుత్ వైర్లు తగిలి షాక్ కొట్టి అక్కడికక్కడే మృతిచెందింది. కుటుంబ జీవనాధారంగా ఉన్న ఆవు మృతిచెందడంతో బాధిత కుటుంబీకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

గుర్తు తెలియని జంతువు దాడిలో మేకలు..

కుల్కచర్ల: గుర్తుతెలియని జంతువు దాడిలో నాలుగు మేకలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. గోరిగడ్డతండా గ్రామ పంచాయతీ శామిలిబాయిదేవ్‌సింగ్‌కు చెందిన మేకలను పొలం దగ్గర కట్టేసి ఉంచగా మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని జంతువుదాడిలో మృతిచెందాయి. బాధిత కుటుంబీకులు చిరుతపులి దాడిలోనే మేకలు మృతిచెందాయని ఆరోపిస్తుండగా అటవీశాఖ అధికారులు పరిశీలించారు. అక్కడ చిరుతకు సంబంధించిన ఆనవాళ్లు లేవని వేరే జంతువు అయి ఉంటుందని వారు స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

వీధి కుక్కల దాడిలో జింక..

దోమ: వీధి కుక్కల దాడిలో జింక మృతిచెందిన సంఘటన దోమ మండల పరిధిలో చోటుచేసుకుంది. మండలంలోని శివారెడ్డిపల్లి గ్రామ సమీపంలో మంగళవారం జింక కళేబరాన్ని స్థానికులు గమనించి అటవీ అధికారులకు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకొని కుక్కలదాడిలో మృతిచెంది ఉండవచ్చని భావించారు. వేసవితాపం కారణంగా వీధికుక్కలు విచక్షణరహితంగా వ్యవహారించడం జరుగుతుందన్నారు. ఎండలకు వీధికుక్కలతో కొంత ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంటుందని అటవీశాఖ అధికారి స్వప్న తెలిపారు.

భువనగిరిలో కాంగ్రెస్‌దే విజయం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి స్థానంలో కాంగ్రెస్ పార్టీ భారీ ఆధిక్యంతో విజయం సాధిస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సోమవారం రాత్రి తొర్రూర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నుంచి భారీ మెజార్టీ ఇస్తామని ఎంపీ అభ్యర్థికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మల్‌రెడ్డిని కలిసిన కిరణ్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి

కార్మికుడి అనుమానాస్పద మృతి

గుట్టుగా మృతదేహం తరలింపు

నందిగామ: విధులకు హాజరైన ఓ కార్మికుడు పరిశ్రమలోనే అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని హెచ్‌బీఎల్ పరిశ్రమలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. పంజాబ్ రాష్ట్రానికి చెందిన దీప్‌సింగ్(38) హెచ్‌బీఎల్ పరిశ్రమలో కొంత కాలంగా కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం టీ విరామం సమయంలో నీరు తాగుతుండగా పడిపోయాడు. వెంటనే పరిశ్రమ నిర్వాహకులు, సిబ్బంది దీప్‌సింగ్‌ను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా మృతుడి కుటుంబ సభ్యులకు అప్పజెప్పింది. ఈ విషయమై పరిశ్రమ హెచ్‌ఆర్ మేనేజర్ కలాంను వివరణ కోరగా.. కార్మికుడు మృతి చెందిన విషయం వాస్తవమేనని అంగీకరించారు. పోలీసులకు ఫిర్యాదు చేయలేదని చెప్పారు. మృతుడి దహన సంస్కారాలకు కొంత ఆర్థికసాయం అందజేశామని వివరించారు. హెచ్‌బీఎల్ పరిశ్రమలో కార్మికుడు మృతి చెందిన విషయమై మాకు ఎలాంటి సమాచారం అందలేదని స్థానిక సీఐ ప్రసాద్ తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తామన్నారు.